క్లుప్తంగా

చిన్నారులను సన్మార్గంలో నడిపించాలి



దాచేపల్లి : చిన్నారులను సన్మార్గంలో నడిపించాలని పాస్టర్ తగరం ప్రేమయ్య అన్నారు. నగర పంచాయతీ పరిధిలోని ఇరికేపల్లి తెలుగు బాప్టిస్ట్ చర్చిలో సండే స్కూల్ చిన్నారులు గురువారం రాత్రి ప్రత్యేక ప్రార్థన కూడిక ఏర్పాటు చేశారు. పాస్టర్ ప్రేమయ్య మాట్లాడుతూ బాలుడు నడవాల్సిన మార్గాన్ని చిన్నప్పటి నుంచే నేర్పించాలని, మంచి మార్గంలో నడిచేలా తల్లిదండ్రులు ప్రయత్నం చేయాలన్నారు. దేవుని యందు భయ భక్తులు కలిగి ఉండాలని, పెద్దవాడైన తరువాత కూడా దేవుని మార్గాన్ని విడిచిపెట్టకుండా జీవించాలని ఆయన తెలిపారు. అనంతరం సండే స్కూల్ చిన్నారులు సాంస్కృతిక కార్యక్రమాలు, ఏసుపుట్టుక నాటిక ప్రదర్శించారు. పాస్టర్ ప్రేమయ్య, సండేస్కూల్ టీచర్ మాతంగి సుధారాణిని సంఘస్థులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో సంఘపెద్దలు నాగెండ్ల రత్నం, యాకోబు, ఆనందరావు, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

మండలంలో ముగిసిన రెవెన్యూ సదస్సులు



వెల్దుర్తి: ప్రభుత్వం ఎంతో కాలంగా రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను సత్వరమే పరిష్కరించేందుకు రెవెన్యూ సదస్సులను నిర్వహిస్తుందని తహసీల్దార్ షేక్ బాషా అన్నారు. శుక్రవారం మండలంలోని చినపర్లపాయ తండాలో జరిగిన రెవెన్యూ సదస్సులో చివరి రోజు ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వం రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించేందుకు గ్రామాలలో రెవెన్యూ సదస్సులు నిర్వహించిందన్నారు. ఈ రెవెన్యూ సదస్సులో రెండు అర్జీలు వచ్చాయన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ వలి, వీఆర్ఓ రాము, రైతులు పాల్గొన్నారు.

ప్రజలు సహకరించాలి

మున్సిపల్ కమిషనర్ వేణుబాబు



మాచర్ల : మునిసిపాలిటీ ఆధ్వర్యంలో గత వారం రోజులుగా ఇంటి పన్నులు గురించి విచారణ చేయడం జరుగుతుందని ప్రతి ఒక్కరూ సహకరించాలని మున్సిపల్ కమిషనర్ డి.వేణుబాబు అన్నారు. పట్టణంలోని సాగర్ రోడ్డులో శుక్రవారం ఆస్తి పన్నుల వివరాలు, గతంలో ఎంత పన్ను ఉంది.. ప్రస్తుతం ఎంత పన్ను వస్తుంది.. గతంలో ఉన్న ఆస్తి వివరాలకు ఇప్పుడు ఉన్న ఆస్తి వివరాలు సరిగ్గా ఉన్నాయా లేదా అని విచారణ చేపట్టారు. సకాలంలో మునిసిపాలిటీకి పన్నులు చెల్లించి పట్టణాభివృద్ధికి సహకరించాలన్నారు. ఇంటి పన్నులు చెల్లించని వారికి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ వెంగయ్య తదితరులున్నారు.

ఎస్టీయూ డైరీ, క్యాలెండర్ ఆవిష్కరణ



మాచవరం: విద్యాభివృద్ధికి రాష్ట్రోపాధ్యాయ సంఘం ఎంతగానో కృషి చేస్తుందని మండల విద్యాధికారి శ్రీధర్ అన్నారు. స్థానిక ఎంఈఓ కార్యాలయంలో నూతన సంవత్సర ఎస్టీయూ డైరీ, క్యాలెండర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో విద్యాభివృద్ధికి ఎస్టీయూ నిర్మాణాత్మకమైన సలహాలు, సూచనలను అందిస్తూ పాఠశాలల బలోపేతానికి, ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో ఎస్టీయూ మండల అధ్యక్షుడు కూరాకుల వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శి కాండ్రగుంట రాంబాబు, రాష్ట్ర కౌన్సిలర్ ఎం.వి.రామిరెడ్డి, జిల్లా కౌన్సిలర్లు వి.ఎం.మూర్తి, జల్లి విజయ్‌ప్రసాద్, ఎం.మరియదాసు, సఖినాల శ్రీనివాసరావు, హెచ్ఎం సురేష్ బాబు, నాయకులు జూగంటి వెంకటేశ్వర్లు, రవికుమార్, కల్యాణి, జానీబాషా, అబ్రహాం, శ్రీనివాసరెడ్డి, జయప్రద పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

రాజుపాలెం: సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని హెల్త్ సూపర్ వైజర్ జీవన్ రావు పేర్కొన్నారు. బలిజేపల్లి ఎస్సీ కాలనీలో ఫ్రైడే–డ్రై డే కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఆరోగ్య సిబ్బంది ఇంటింటికి తిరిగి సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని కరపత్రాలు పంపిణీ చేశారు. ఇళ్లల్లో నిల్వ ఉన్న నీటిని తొలగించారు. ఏఎన్ఎం పి.శ్రీకళ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

సులభ్ కాంప్లెక్స్ నిర్మించేనా..!?

- రహదారులు, మూలమలుపులే మూత్రశాలలుగా మారిన వైనం
- ఆసుపత్రులు, షాపింగ్ మాల్స్‌తో విస్తరిస్తున్న పట్టణం
- నియోజకవర్గ కేంద్రంలోనే మూత్రశాలలు లేక ప్రజల ఇబ్బందులు

దేశంలో బహిరంగ మూత్ర విసర్జన అనేది చట్ట విరుద్ధం. దీనిని పబ్లిక్ న్యూసెన్స్‌గా పరిగణించి శిక్షలు కూడా విధిస్తారు. కానీ దీనిపై అవగాహన కల్పించడంలో ప్రభుత్వాలు విఫలమవుతున్నాయి. అలాగే అధికారులు పట్టించుకోవడం లేదు. ప్రజలు కూడా బాధ్యతా రహితంగా ప్రవర్తిస్తున్నారు. బహిరంగ మూత్ర విసర్జనపై అవగాహన కల్పించి ప్రజలలో చైతన్యం తీసుకురావడానికి ప్రభుత్వాలు, అధికారులు చర్యలు చేపట్టాలి.

మాచర్ల రూరల్: నియోజకవర్గ కేంద్రమైన మాచర్ల పట్టణం రోజు రోజుకు అభివృద్ధి చెందుతుంది. పట్టణంలోని వైద్యశాలలు, షాపింగ్ మాల్స్‌కు వివిధ పనుల నిమిత్తం నిత్యం గ్రామాల ప్రజలు రాకపోకలు సాగిస్తుంటారు. చుట్టు ప్రక్కల గ్రామాల నుంచి వివిధ పనుల నిమిత్తం పట్టణానికి వచ్చే ప్రజలతో నిత్యం రద్దీగా ఉంటుంది. గ్రామాల నుంచి వచ్చే ప్రజలు కనీస అవసరమైన సులభ్ కాంప్లెక్స్ లేక ఇబ్బందులు పడుతున్నారు. పట్టణంలో ఒక్క పబ్లిక్ టాయిలెట్ లేకపోవటంతో తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. గతంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం సులభ్ కాంప్లెక్స్ నిర్మాణానికి టెండర్లు పిలిచింది. అయితే ఎన్నికలు రావడంతో పనులు చేపట్టలేదు. అనంతరం అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం టెండర్లను రద్దు చేయడంతో పనులు ఎప్పుడు మొదలు పెడతారో తెలియని పరిస్థితి.



పట్టణంలో నిరుపయోగంగా ఉన్న సులభ్ కాంప్లెక్స్

త్వరలో నిర్మాణం చేపడతాం



పట్టణంలో కొత్తగా ఐదు సులభ్ కాంప్లెక్స్‌లు నిర్మించేందుకు టెండర్లు పిలిచాం. త్వరలో నిర్మాణ పనులు చేపడతాం. కొమ్మళ్ళ కాలువ వద్ద నిరుపయోగంగా ఉన్న సులభ్ కాంప్లెక్స్‌ను వినియోగంలోకి తీసుకొస్తాం. ప్రజలకు ఇబ్బంది లేకుండా అన్ని ప్రాంతాలలో సులభ్ కాంప్లెక్స్‌ల నిర్మాణం చేపడుతున్నాం.

– ధూళిపాళ్ళ వేణుబాబు, మున్సిపల్ కమిషనర్

బస్టాండ్ వద్ద తొలగింపు



గతంలో ఆర్టీసీ బస్టాండ్‌కు వెళ్లే రహదారిలో సులభ్ కాంప్లెక్స్ నిర్మించారు. కొన్ని కారణాలతో వాటిని పడగొట్టారు. వాటి స్థానంలో కొత్తగా కట్టేందుకు కొన్ని నెలల క్రితం వాటిని పూర్తిగా తొలగించారు. నిర్మాణం ఎప్పుడు చేపడతారో అర్థం కాక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

నిరుపయోగంగా టాయిలెట్



పట్టణంలోని గడియార స్తంభం, కొమ్మళ్ల కాలువకు వెళ్లే రహదారిలో లక్షల వ్యయంతో సంవత్సరం క్రితం నిర్మించిన పురపాలక సంఘ టాయిలెట్ నిరుపయోగంగా మారిపోయింది. టాయిలెట్ నిర్వహణ చేసే వారు లేక బేసిన్‌లు, బాత్‌రూంలోని విడిభాగాలు పగిలిపోయి, చెత్తా చెదారంతో నిండిపోయింది. అసలే పట్టణంలో టాయిలెట్లు లేక ఇబ్బంది పడుతున్న ప్రజలకు ఉన్న ఒక్కటి కూడా పట్టించుకునే అధికారులు లేకపోవటంతో పురపాలక సంఘ నిధులు నిరుపయోగం కావటంతో పాటు తీవ్ర అసౌకర్యానికి గురవటంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

దుర్వాసన వెదజల్లుతుంది



పట్టణంలోని బస్టాండ్ మూలమలుపు, అంబేడ్కర్ పార్కు సెంటర్ ప్రహరీ గోడ, రైల్వే స్టేషన్ రహదారి, పోలీసు క్వార్టర్స్ ప్రాంతాలలోని గల్లీలే నేడు మూత్రశాలలుగా మారిపోయాయి. పట్టణానికి రాకపోకలు సాగించే గ్రామీణ ప్రజలతో పాటు పట్టణ ప్రజలు మూత్రం పోయటంతో ఈ ప్రాంతమంతా దుర్వాసన వెదజల్లుతుంది. ఈ రహదారులలో రాకపోకలు సాగించాలంటే ముక్కు మూసుకొని వెళ్లాల్సిన పరిస్థితి ఉంది. మహిళలు వెళ్లాలంటే తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కుటుంబ అవసరాల నిమిత్తం షాపులలో పనిచేసే మహిళలు ఆ ప్రాంతాలలో టాయిలెట్లు లేకపోవడంతో నీరు ఎక్కువ తాగకుండా అనారోగ్యం పాలవుతున్నట్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రోజు రోజుకు పెరుగుతున్న పట్టణ జనాభా వివిధ అవసరాల నిమిత్తం వచ్చే గ్రామీణ ప్రాంతవాసుల అవసరాలు గుర్తించి వెంటనే పురపాలక శాఖాధికారులు సులభ్ కాంప్లెక్స్‌ను నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు.

న్యాయవాదుల నిరసన



పిడుగురాళ్ల: పట్టణంలోని జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో బార్ అసోసియేషన్ ఆఫ్ పిడుగురాళ్ల ఆధ్వర్యంలో పొన్నూరుకు చెందిన న్యాయవాది బేతల ప్రకాశరావుపై పోలీసులు అమానుషంగా ప్రవర్తించి దాడి చేసిన ఘటనపై రాష్ట్ర వ్యాప్తంగా నిరసన కార్యక్రమాలలో భాగంగా శుక్రవారం నిరసన కార్యక్రమాన్ని నిర్వహించినట్లు బార్ అసోసియేషన్ అధ్యక్షులు కుమారస్వామి తెలిపారు. న్యాయవాదులపై దాడులు చేయడం హేయమైన చర్య అని అలాంటి పోలీసులపై కఠినమైన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ స్టాండింగ్ కౌన్సిల్ సభ్యులు ఉడతా కోటేశ్వరరావు, కంభంపాటి కోటేశ్వరరావు, రామిరెడ్డి, కావూరి జలారావు, బత్తుల దాసు, యతిరాజు లక్ష్మీ, కోవూరి వెంకటేశ్వర్లు, లోకేశ్వరి, వెలిశల రామకృష్ణ, బెల్లకొండ అచ్చారావు, మదాసు వెంకటేశ్వరరావు, ప్రశాంత్ నాయక్, ఎస్వీ కోటేశ్వరరావు, సాగర్, ఆయాజ్ అహమద్, నవ్య, పల్లవి, రాజశేఖర్ తదితరులు ఉన్నారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని యాచకురాలు మృతి



గురజాల : ఆర్టీసీ బస్సు ఢీకొని యాచకురాలు మృతి చెందిన ఘటన గురువారం రాత్రి చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మృతురాలు స్థానిక బస్టాండ్‌లో గత మూడు నెలల నుంచి భిక్షాటన చేస్తూ జీవనం సాగిస్తుంది. మృతురాలికి రెండు కాళ్లు పనిచేయవు. గురువారం రాత్రి బస్టాండ్ లోపల నుంచి బయటకు వస్తున్న తరుణంలో ఆర్టీసీ బస్సు ఢీకొంది. ఈ ప్రమాదంలో అక్కడికక్కడే ఆమె మృతి చెందింది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గురజాల సామాజిక ఆరోగ్య కేంద్రంకు తరలించారు. మృతురాలి వయస్సు సుమారు 40–45 మధ్య ఉంటుందని ఆమె వివరాలు ఎవరికైనా తెలిస్తే స్థానిక పోలీస్ స్టేషన్‌కు సమాచారం ఇవ్వాలన్నారు.

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం

తుమ్మకోట(రెంటచింతల): 18 సంవత్సరాలు నిండకుండా బాలికలకు వివాహాలు చేయడం చట్టరీత్యా నేరమని ఐసీడీఎస్ రెంటచింతల–2 సెక్టార్ సూపర్‌వైజర్ నాగమణి అన్నారు. శుక్రవారం మండలంలోని తుమ్మకోట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన కిశోర వికాసం కార్యక్రమంలో ఆమె పాల్గొని విద్యార్థినులకు బాల్య వివాహాలపై అవగాహన కల్పించి మాట్లాడారు. ఎదిగి ఎదగని వయస్సులో పరిపక్వత రాకుండా బాలికలకు వివాహం చేయడం వలన శారీరకంగా, మానసికంగా ఎంతో నష్టపోతారన్నారు. లింగ వివక్షను పారదోలేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. గ్రామాలలో బాల్య వివాహాలు జరుగుతున్నట్లు తెలిసిన వెంటనే ఐసీడీఎస్, పోలీస్, రెవెన్యూ, ఇతర ప్రభుత్వ అధికారులకు సమాచారం ఇవ్వాలని, బాల్య వివాహాలను అరికట్టడంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఆమె కోరారు. అంగన్‌వాడీ కేంద్రాలలో తల్లిదండ్రులకు బాల్య వివాహాలపై అవగాహన కల్పించాలన్నారు. మారుతున్న కాలానికి అనుగుణంగా బాలికల విద్యపై తల్లిదండ్రులు దృష్టి పెట్టినప్పుడే బాలికలు అన్ని రంగాల్లో అగ్రస్థానంలో నిలుస్తారన్నారు. అనంతరం విద్యార్థినులు, ఆశాలు, అంగన్‌వాడీ టీచర్లతో మానవహారంగా ఏర్పడ్డారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు, ఆశా కార్యకర్తలు, విద్యార్థినులు తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థినులతో మానవహారంగా ఏర్పడి ప్రతిజ్ఞ చేస్తున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నాగమణి

పేదలకు ఉపాధి కల్పించాల్సిన బాధ్యత ఎఫ్ఏలదే



రెంటచింతల: గ్రామీణ ప్రాంతాలలో వలసలను నివారించేందుకు ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద గ్రామాలలో పేదలకు ఉపాధి పనులను కల్పించాల్సిన బాధ్యత ఫీల్డ్ అసిస్టెంట్‌లదేనని కమిషనర్ కృష్ణతేజ అన్నారు. శుక్రవారం ఎంపీడీఓలకు, ఏపీఓలకు, ఫీల్డ్ అసిస్టెంట్‌లకు ఏర్పాటు చేసిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడారు. ఉపాధి పనులకు వచ్చే పేదలైన కూలీలతో 6 గంటలు పని చేసే విధంగా చర్యలు చేపట్టి రోజుకు కచ్చితంగా రూ.300 వేతనం వచ్చేలా ఫీల్డ్ అసిస్టెంట్‌లు కృషి చేయాలన్నారు. శ్రమశక్తి సంఘాల ఏర్పాటుకు రెండు, మూడు రోజులలో ఉత్తర్వులు జారీ చేయడం జరుగుతుందన్నారు. ఈ సమావేశంలో ఎంపీడీఓ కె.సరోజినిదేవి, ఏపీఓ జయచంద్రకుమార్, టీఏ విజయకుమారి, బీఎఫ్‌టీ కోటేశ్వరరావు, ఎఫ్ఏలు ఆర్.సామ్యానాయక్, కనకయ్య, వంశీ తదితరులున్నారు.

గెలుపు, ఓటములను సమానంగా తీసుకోవాలి

సీఐ శ్రీరాం వెంకట్రావు



పిడుగురాళ్ల: గెలుపు ఓటములను క్రీడాకారులు సమానంగా తీసుకోవాలని పట్టణ సీఐ శ్రీరాం వెంకట్రావు అన్నారు. పట్టణంలోని స్కాలర్ డిగ్రీ కాలేజ్ గ్రౌండ్‌లో కన్నెగంటి భార్గవనాయుడు జ్ఞాపకార్థం ఏర్పాటు చేసిన మండల స్థాయి క్రికెట్ టోర్నమెంట్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా సీఐ వెంకట్రావు మాట్లాడుతూ క్రీడాకారులు సమన్వయంతో పని చేసుకొని టోర్నమెంట్ విజయవంతం చేయటంలో భాగస్వాములు కావాలన్నారు. క్రీడాస్ఫూర్తితో క్రీడాకారులు పని చేయాలన్నారు. అనంతరం క్రికెట్ ఆడి ఇరుజట్లను పరిచయం చేసుకొని టాస్ వేయించారు. ఈ కార్యక్రమంలో స్కాలర్స్ డిగ్రీ కాలేజీ ప్రిన్సిపాల్ ఆవుల జనార్దన్‌రావు, నిర్వాహకులు (క్రేజీబాయ్స్) సన్నీ, జానీ, రవి, సద్దాం, గఫూర్, రత్నం, బాబు, వెంకటేష్ నాయక్ తదితరులు ఉన్నారు.

మిరపలో తామర తెగులు నివారణకు సూచనలు

మాచర్ల రూరల్: మిరపలో నల్ల తామర పురుగు నివారణకు వ్యవసాయాధికారుల సూచనలు, సలహాలు పాటించి నష్టాన్ని నివారించి మేలైన దిగుబడిని పొందాలని ఉద్యాన శాఖాధికారి ఎన్.సురేష్ కోరారు. శుక్రవారం మండలంలోని రాయవరం, తాళ్ళపల్లి గ్రామాలలోని మిర్చి పొలాల్లో రైతులకు వివరించి ఆయన మాట్లాడారు. నల్ల తామర పురుగు నివారణకు ఎకరాకు 200 కేజీల వేపపిండి భూమిలో వేయాలని, దీని వలన తామర పురుగును కోశస్థ దశలోనే నియంత్రించవచ్చునన్నారు. పురుగు మందును పిచికారీ చేసేటప్పుడు వాటిలో పదివేల పీపీఎం వేప నూనెను ఒక లీటర్‌కు రెండు మి.లీ. చొప్పున కలుపుకొని పిచికారీ చేయాలన్నారు. నత్రజని ఎరువులను అధిక మోతాదులో వాడకూడదన్నారు. పసుపు, నీలి రంగు జిగురు అట్టలను 50 నుంచి 60 చొప్పున పొలంలో అక్కడక్కడ ఏర్పాటు చేసుకోవాలని, పురుగు మందులైన అసిటామప్రిడ్ 2గ్రా. లేక థయోమిథాగ్జామ్ 0.5 గ్రాముల నీటిలో కలుపుకొని పిచికారీ చేయాలన్నారు. బొబ్బర తెగులు నివారణకు ఆశించిన మొక్కలను మొదటి దశలోనే పీకి కాల్చివేయాలన్నారు. కార్యక్రమంలో వీహెచ్ఏలు శివా బాయి, కరుణాకర్ నాయక్, రైతులు ఉన్నారు.



రైతులకు సూచనలిస్తున్న ఉద్యాన శాఖాధికారి ఎన్.సురేష్

మున్సిపల్ కార్మికుల ఆందోళన



దాచేపల్లి నగర పంచాయతీ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న కార్మికులు

దాచేపల్లి : సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో మున్సిపాలిటీ ఇంజనీరింగ్ కార్మికులు శుక్రవారం ఆందోళన చేపట్టారు. స్థానిక నగర పంచాయతీ కార్యాలయం ముందు కార్మికులు బైఠాయించి ధర్నా చేశారు. సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి తెలకపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ కార్మికుల సమస్యలను తక్షణమే పరిష్కరించేందుకు కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని, కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలని డిమాండ్ చేశారు.
కార్మికులను ఆప్కాస్ సంస్థలో చేర్చి 11వ పీఆర్సీ వేతనం అమలు చేయాలని, పండుగ, క్యాజువల్ సెలవులు ఇవ్వాలని ఆయన అన్నారు. ఎటువంటి నిబంధనలు లేకుండా ప్రభుత్వ సంక్షేమ పథకాలు కార్మికులకు అందజేయాలని డిమాండ్ చేశారు. అనంతరం కార్యాలయం ఆర్ఐ ప్రసాద్‌కి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఇంజనీరింగ్ కార్మికులు శ్రీను, నరేష్, సైదారావు, కోటయ్య, నాగేశ్వరరావు, వెంకటేష్, సైదారావు తదితరులు పాల్గొన్నారు.



మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న మున్సిపల్ కార్మికులు, సీఐటీయూ నాయకులు

మున్సిపల్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలి

పిడుగురాళ్ల: మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికుల సమస్యలు వెంటనే పరిష్కరించాలని సీఐటీయూ, మునిసిపల్ ఇంజనీరింగ్ కార్మికుల ఆధ్వర్యంలో శుక్రవారం మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ మండల కార్యదర్శి తెలకపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో సమ్మె సందర్భంగా ఇంజనీరింగ్ కార్మికులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని, ఇంజనీరింగ్ కార్మికులను పర్మినెంట్ చేయాలని, కనీసం వేతనం రూ.26 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. 11వ పీఆర్సీ ప్రకారం వేతనాలు అమలు చేయాలని అన్నారు. ఇంజనీరింగ్ కార్మికులకు యూనిఫాం, సబ్బులు, నూనెలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఇంజనీరింగ్ కార్మికులు షేక్ సుభాని, గద్దె శ్రీనివాసరావు, విజయ్, కోవూరి రమేష్, గాలి పవన్, కాండ్రగుంట రాజు, ఎన్ సురేష్, ఎస్‌కే మాబు సుభాని, పి.వెంకయ్య, లక్ష్మీ, రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సావిత్రిబాయి పూలే జయంతి



సావిత్రిబాయి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



నేషనల్ నవక్రాంతి పార్టీ ఆధ్వర్యంలో సావిత్రిబాయి పూలే జయంతి



సావిత్రిబాయి జయంతి సందర్భంగా మహిళ అధ్యాపకులను సన్మానించిన దృశ్యం

గురజాల : బడుగు బలహీన వర్గాలకు చదువులు నేర్పిన ఘనత సావిత్రిబాయి పూలేకు దక్కుతుందని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ సిద్దాడపు గాంధీ అన్నారు. స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో శుక్రవారం సావిత్రిబాయి పూలే జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా సావిత్రిబాయి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్త్రీ విద్యను నిషేధించిన రోజుల్లో స్త్రీలకు విద్యను నేర్పించేందుకు పాఠశాలను ప్రారంభించిన గొప్ప వ్యక్తి సావిత్రిబాయి అని అన్నారు. మహిళా సాధికారత కోసం కృషి చేసిన మహనీయురాలన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకుడు వేముల చలమయ్య, పోలా సతీష్, జక్కా సత్యనారాయణ తదితరులు ఉన్నారు.

బలహీన వర్గాల అభ్యున్నతికి సావిత్రిబాయి కృషి ఎనలేనిది

గురజాల రూరల్ : బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి సావిత్రి బాయి పూలే కృషి ఎనలేనిదని నేషనల్ నవక్రాంతి పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు కనకం శ్రీనివాసరావు అన్నారు. పూలే జయంతిని పురస్కరించుకుని ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి శుక్రవారం నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1848లోనే పాఠశాలను ప్రారంభించి విద్యను అందించి మహిళలు చదువుకోవడానికి మొదటి ఉపాధ్యాయునిగా మారిన వ్యక్తి సావిత్రి బాయి పూలే అని అన్నారు.

సావిత్రిబాయి పూలేకి ఘనంగా నివాళి

దాచేపల్లి : సావిత్రిబాయి పూలే జయంతి వేడుకలను నారాయణపురం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శుక్రవారం నిర్వహించారు. సావిత్రిబాయి పూలే చిత్రపటానికి ప్రిన్సిపాల్ టి.జె.చంద్రశేఖర్ రావు, గామాలపాడు సర్పంచ్ జంగా సురేష్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కళాశాలలో విధులు నిర్వహిస్తున్న మహిళ అధ్యాపకులను శాలువా, పూలమాలలతో సన్మానించారు. మహిళలు అక్షరాస్యత వైపు అడుగులు వేసేలా సావిత్రిబాయి పూలే కృషి చేశారని, మహిళలకు చదువు నేర్పిన తొలి గురువు అని ప్రిన్సిపాల్ చంద్రశేఖర్ అన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ షేక్ షరీఫ్, కళాశాల అభివృద్ధి కమిటీ చైర్మన్ తెలనాకుల సత్యనారాయణ, బలహీన వర్గాల ఐక్యవేదిక పట్టణ కన్వీనర్ గరికపాటి వెంకట్‌కుమార్, నాయకులు ముశ్యం వెంకటేశ్వర్లు, గద్దల వేదమణి, బుర్రి కృష్ణారెడ్డి, పెరుమళ్ల నరసింహారావు, వట్టెపు సుందర్రావు, కొండవీటి కొండలరావు, గోను మస్తాన్‌రావు, పఠాన్ రహీం, శరత్ తదితరులు పాల్గొన్నారు.

మాచర్ల : స్థానిక కాసు బ్రహ్మనందరెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం భారతీయ మొదటి మహిళా ఉపాధ్యాయురాలైన సావిత్రిబాయి పూలే జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జయలక్ష్మి కుమారి అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, బీసీ సమన్వయ కమిటీ రాష్ట్ర కో ఆర్డినేటర్ గుండాల సైదులుయాదవ్, జిల్లా కన్వీనర్ పఠాన్ జానీ బాషా, ప్రధాన కార్యదర్శి గురజాల అప్పారావు, జ్యోతి, విద్యార్థులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో సావిత్రిబాయి పూలే జీవితాన్ని, వ్యక్తిత్వాన్ని, వారి గొప్పతనాన్ని, స్త్రీ విద్యలో సావిత్రిబాయి పాత్రను, స్త్రీల కోసం ప్రత్యేక పాఠశాలలను ఏర్పాటు చేయడంలో భర్తతో పాటు నడిచిన ఆమె ఔన్నత్యాన్ని, ప్లేగు వ్యాధి నిర్మూలనలో ఆమె సేవలను వక్తలు విద్యార్థులకు వివరించారు. మహాత్ములు ఆచరించి చూపిన మార్గంలో నడవడం అవసరమన్నారు.



సావిత్రిబాయి పూలే చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కళాశాల యాజమాన్యం

కోడి పందేలు నిర్వహిస్తే చర్యలు

బెల్లంకొండ: సంక్రాంతి పండుగ సందర్భంగా మండలంలోని గ్రామాల్లో కోడి పందేలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ డి.ప్రవీణ్ హెచ్చరించారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో శుక్రవారం మాట్లాడుతూ మూగ జీవాల హింస, జూద క్రీడలు చట్టరీత్యా నేరమన్నారు. కోడి పందేలు నిర్వహిస్తే వారి వివారాలను పోలీసులకు తెలియజేయాలన్నారు.

